క్లుప్తంగా

ముద్రా రుణాలతో జీవనోపాధి

బోట్‌క్లబ్: నిరుద్యోగ యువతకు ముద్రా రుణాలతో జీవనోపాధి లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం కాకినాడ నగరానికి చెందిన గొల్లపల్లి సుబ్బారావు ముద్రా పథకంలో కొనుగోలు చేసిన ఆటోను ఆయన ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ముద్రా రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి సహకరించాలి

బోట్‌క్లబ్: మార్చి నెల ముగియనున్న నేపథ్యంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఆస్తి పన్నులు చెల్లించి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం రంజాన్ సెలవు దినమైనప్పటికీ, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పన్నులు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సచివాలయాలతో పాటు, ఆనందభారతి మైదానం వద్దనున్న మున్సిపల్ కార్యాలయంలోను పన్నులు చెల్లించేందుకు కౌంటర్లు ఏర్పాట్లు చేశామన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృష్ణకుమార్‌కు కళారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న నాట్యాచార్య కృష్ణకుమార్

బోట్‌క్లబ్: నాట్య రంగంలో విశేష సేవలందిస్తున్న కాకినాడకు చెందిన నాట్యాచార్య కృష్ణకుమార్ కళారత్న అవార్డు అందుకున్నారు. ఉగాది సందర్భంగా ఆదివారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి అవార్డు తీసుకున్నారు. ఐదు దశాబ్దాలుగా కాకినాడ నగరంలో నృత్యశిక్షణ ఇస్తూ, అనేక మందిని గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దారు. నాట్య రంగంలో కాకినాడకు తొలి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్‌ను పలువురు అభినందనలు తెలిపారు.

నేత్ర పర్వంగా భీమేశ్వరస్వామి కల్యాణం

సామర్లకోట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి వారి కల్యాణం ఆదివారం నేత్ర పర్వంగా జరిగింది. ఆలయ భక్త సంఘ నాయకుడు బిక్కిన సాయి దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. నంది మండపం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఉంచి ఆలయ పండితులు తొలుత విఘ్నేశ్వర పూజ చేసి కల్యాణం జరిపించారు.

తలకెక్కించుకోండి..!

- హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ
- వాహనదారులు తప్పక ధరించాల్సిందే..
- అవగాహన కల్పిస్తున్న కాకినాడ పోలీసులు



కాకినాడలో హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ సిటీ: రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నిత్యం కాకినాడ డివిజన్ ప్రాంతంలోని గ్రామాలతో పాటు, కాకినాడ సిటీ, రూరల్ పరిధిలో ఏదో ఓ చోట మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు ప్రమాదానికి గురవుతూనే ఉన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం జరగడం ఆందోళన కలిగించే అంశంగా ఉంది. దీంతో ఆయా కుటుంబాల జీవన పరిస్థితులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

ప్రయోజనాలెన్నో..

రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం మంది తలకు తీవ్రమైన గాయాలు కావటంతో మృత్యువాత పడుతున్నారని తెలుస్తోంది. ప్రమాదాల్లో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు తరలిస్తున్నా తలకు తీవ్రమైన గాయం కావటంతో చికిత్స అందించినా కోమాలోకి వెళ్లటమో, ప్రాణాలు కోల్పోవడమో జరుగుతుంది. ఇలాంటి మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే కేవలం హెల్మెట్ ధరించడం ఒక్కటే పరిష్కారంగా భావిస్తున్నారు. ఇటీవల కాలంలో కాకినాడ-యానాం రోడ్డులో తాళ్లరేవు మండలం చొల్లంగి వద్ద, పి.మల్లవరం సమీపంలోను, సామర్లకోట రోడ్డు ప్రధాన రహదారిలోను, కరప, వేళంగి, నడకుదురు తదితర ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో యువత మోటార్ సైకిళ్లపై వేగంగా వెళ్లి, హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలకు గురై చనిపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇటీవల ఇంటర్మీడియెట్ పరీక్షకు వెళ్లున్న యువకులు అచ్చంపేట సమీపంలో రోడ్డుపై ఉన్న ఇసుకలో వేగంగా వాహనం నడపడం వల్ల అదుపుతప్పి పడడంతో, హెల్మెంట్ లేక చనిపోయిన సంఘటన చోటుచేసుకుంది. జగ్గంపేట మండలంలో జాతీయ రహదారిపై గురువారం రెండు మోటారు సైకిళ్ల ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మరణించారు.

పోలీసుల ప్రత్యేక చర్యలు

కాకినాడ జిల్లా ఎస్పీ మాధవ్ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాకినాడ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేస్తూ బోర్డులు ఏర్పాటు చేయడం, వేగాన్ని నియంత్రించేలా బారికేడ్లు, సైన్ బోర్డులు పెడుతున్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతల్లో ప్రయాణించే వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముందుగా వాహనదారులకు అవగాహన కల్పించడం, స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. తొలుత స్వల్ప జరిమానా విధిస్తూ, హెల్మెట్ ధరించాలని చెబుతున్నారు. అనంతరం కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

హెల్మెట్ ధరించాలి

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. ఇప్పటికే నాలుగు నెలల నుంచి ప్రజలకు హెల్మెట్ ధరించటంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలకు మోటారు సైకిళ్లను కొనుగోలు చేయటంతో పాటు, హెల్మెట్ కూడా ఇవ్వాలని, అతివేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు చెప్పాలని వారికీ చెబుతున్నాం.

– దేవరాజ్ మనీష్‌పాటిల్, ఎస్‌డీపీవో, ఏఎస్పీ, కాకినాడ

ప్రాణం విలువైనవి

దేశానికి యువశక్తి ఎంతో ముఖ్యం. యువత తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి. రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే అత్యధిక సంఘటనల్లో తలకు తీవ్ర గాయాలు కారణంగానే మృత్యువాత పడుతున్నారని, ముఖ్యంగా యువత చనిపోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. హెల్మెట్ ధరించడంతో ప్రాణాప్రాయం నుంచి రక్షణ లభిస్తుంది. తాను మరణిస్తే కుటుంబ సభ్యుల పరిస్థితిపై వాహన చోదకులు ఆలోచించాలి.

– ఎస్.రమేష్, సీఐ, ట్రాఫిక్-1, కాకినాడ

ఎడ్ల పరుగు విజేతలకు సన్మానం



విజేతలను సత్కరిస్తున్న సేవా సమితి సభ్యులు

కాకినాడ రూరల్: ఎడ్ల పరుగు పందెం పోటీలలో విజేతలుగా నిలిచిన కాకినాడ రూరల్ కొవ్వాడకు చెందిన నవనీ మణికంఠ కుమారులు మట్టా చినవీర్రాజు, మట్టా బాపనయ్య, సత్యనారాయణను ఉగాది సందర్భంగా శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ నెల 12వ తేదీన రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి పొందారు. అలాగే వీరు 2024 జనవరిలో ధర్మవరంలో జరిగిన పోటీల్లో పాల్గొని జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని, జూన్‌లో చేబ్రోలులో జరిగిన జూనియర్స్ విభాగంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 2025 మార్చి 9న పెద్దిపాలెంలో సీనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ చేయాలి



సామర్లకోటలో కొవ్వొత్తుల ప్రదర్శన

సామర్లకోట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ మండల పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం సాయంత్రం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీబీఎం సెంటర్ నుంచి మెహర్ కాంప్లెక్స్, మతం సెంటర్ మీదుగా స్టేషన్ సెంటర్‌కు చేరుకుని ధర్నా చేశారు. ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలని, క్రైస్తవులపై దాడులు అరికట్టాలని నినాదాలు చేశారు. ధర్నా అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ మడికి సోనియా మాట్లాడుతూ, హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలున్నాయని చెప్పారు. కొనేళ్లుగా క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ మృతిపై సీబీఐతో విచారణ చేసి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, మండల పాస్టర్ల సంఘ ప్రతినిధులు టి.బ్లెసింగ్, కె.జయబాబు, జె.జయరాజు, చంటి, లాజరస్, వై.కరుణకుమార్, పి.తిమోతీ, పి.ఆనంద్‌బాబు, ఎంఏ జేమ్స్, వి.జాన్, కిరణ్‌కుమార్, ఎస్.సైలాస్, బెంజిమాన్, ఎం.సాల్మన్‌రాజు, కరుణానిధి పాల్గొన్నారు.



రంజాన్ వేడుకలకు ముస్తాబైన మెయిన్ రోడ్డులోని జామియా మసీదు



పెద్ద మసీదులో ముస్లింలకు ఉగాది పచ్చడి అందిస్తున్న నాయకులు

రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

బోట్‌క్లబ్: ముస్లింలకు సమస్త శుభాలు కలిగించే రంజాన్ వేడుకను వైభవంగా నిర్వహించుకునేందుకు కాకినాడ నగరంలోని పలు మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రంజాన్ ఉపవాస దీక్షల అనంతరం చివరి రోజున నగరంలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం నెలవంక దర్శనం కావడంతో, సోమవారం రంజాన్ పండగకు అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంలో ఏ మసీదులో చూసినా సందడి నెలకొంది. నగరంలో ఉన్న అన్ని మసీదుల్లో రంజాన్ ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈదుల్ ఫితర్ నమాజ్ కోసం జేఎన్‌టీయూకే వద్దనున్న ఈద్గా మైదానంలో నూరానీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు నమాజు నిర్వహించనున్నారు. రంజాన్ సందర్భంగా కాకినాడ నగరంలో మసీదులను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈద్గా మైదానంలో ప్రార్థనల కోసం నగరం, రూరల్ ప్రాంతాలు నుంచి వేలాదిగా ముస్లింలు తరలిరానున్న నేపథ్యంలో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రార్థనల్లో పాల్గొనే ముస్లింలకు అందించేందుకు మంచినీరు, శీతల పానీయాలు అందించేందుకు ముస్లిం యువత ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే స్త్రీలకు ప్రత్యేక పరదా ఏర్పాటు చేసి, నమాజులో పాల్గొనే అవకాశం కల్పించేందుకు పలు కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

మత సామరస్యం వెల్లివిరిసేలా..

కాకినాడ మెయిన్ రోడ్డులోని జామియా మసీదులో ఆదివారం సాయంత్రం కాకినాడ ఖిద్మత్ కమిటీ, జామియా మసీదు సంయుక్త ఆధ్వర్యంలో హిందువులు ఉగాది పురస్కరించుకుని మత సామరస్యం వెల్లివిరిసేలా ఇఫ్తార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హిందువులు ఉగాది పచ్చడి అందించగా, ముస్లింలు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. హిందువులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖిద్మత్ కమిటీ అధ్యక్షులు ఎస్కే చిష్టి, కార్యదర్శి హుస్సేన్, కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు హసన్ షరీఫ్, జామియా మసీద్ కమిటీ అధ్యక్షులు ఎజాజుద్దీన్ పాల్గొన్నారు. ప్రజా ఐక్య సంఘాల నాయకులు పప్పు దుర్గారమేష్, రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు పిట్టా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నమాజు సమయాలు

ఈద్గా మైదానంలో ఉదయం 8 గంటలకు, జె.రామారావుపేట మక్కా మసీద్‌లో ఉదయం 8. 15, కొత్తూరు మదీనా మసీద్‌లో 8.30, జగన్నాథపురం మస్జిదే అజంలో 8.30, సాంబమూర్తినగర్ హజీబియా మసీద్‌లో 8.30, కొత్తపేట సగీనా మసీద్‌లో 8.30, పర్లోవపేట మస్జిద్ ఎ బషీర్ గౌసుల్‌వరాలో 8.45, జగన్నాథపురం అక్బర్ మసీద్‌లో 8.45కు ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.



ఈద్గా మైదానంలో నమాజు కోసం చేసిన ఏర్పాట్లు

ఆలయాల్లో తెలుగు సంవత్సరాది ప్రత్యేక పూజలు



కరపలో గంటాలమ్మ అమ్మవారు



పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ



టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

బోట్‌క్లబ్: తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది రోజు ఆదివారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు ఉగాది సందర్భంగా బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక టూటౌన్, మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు భారీగా తరలివచ్చారు. దర్శనం కోసం గంటకుపైగా వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులు అమ్మవారికి చీర, గాజులు ఇచ్చి వారి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి అమ్మవారికి బుక్క సంబరం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ఎం మురళీవీరభద్రరావు పాల్గొన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల దర్శనం కోసం పోటెత్తారు. స్థానిక భోగి గణపతి పీఠంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు ఉగాది పచ్చడి అందజేశారు.

పోటెత్తిన భక్తులు

ఉగాది రోజున స్థానిక టూటౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో దర్శనం కోసం భక్తులు క్యూలు కట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూలో భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచిత దర్శనంతో పాటు, రూ.30 దర్శనం కోసం భక్తులు గంటలు కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ వీర్రాజుచౌదరి, ఫెస్టివల్ ప్రత్యేకాధికారి వడ్డి ఫణికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కరప విష్ణాలయంలో వేణుగోపాలస్వామి



యండమూరులోని మీసాల వేంకటేశ్వరస్వామి

ఘనంగా గంటాలమ్మ తీర్థం

కరప: గ్రామంలోని పల్లపువీధి గ్రామ దేవత గంటాలమ్మ తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. వేద పండితుల బృందం ఉదయం అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. కరప, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముందురోజు రాత్రి గరగ నత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారికి జాతర నిర్వహించారు.

గొడ్డటిపాలెంలో..

మండలంలోని గొడ్డటిపాలెం గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున తీర్థం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ముందు రోజు రాత్రి, తెల్లవార్లూ గరగ నత్యాలు, గారడీలతో అమ్మవారికి జాతర నిర్వహించారు. గొడ్డటిపాలెం గ్రామస్తులు, పరిసర గ్రామాల వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల వినతి మేరకు 2023లో అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షల నిధులు మంజూరు చేయగా, ఆలయాన్ని పునర్నిర్మించినట్టు మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు తెలిపారు.



గొడ్డటిపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కరప: ఉగాది సందర్భంగా మండలంలోని విష్ణు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. కరప విష్ణాలయంలో వంశపారంపర్య అర్చకులు పెద్దింటి గోపాలకృష్ణ, అనంతాచార్యులు, సూర్యనారాయణ ప్రత్యేక పూజలు, పంచాంగ పఠనం చేశారు. ఈఓ కె.తిరుమల రవితేజ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేళంగి, కూరాడ, వాకాడ, వేములవాడు, పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రంగరాయలో ఉగాది వేడుకలు

కాకినాడ క్రైం: ఉగాది వేడుకలు స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో ఆదివారం ఘనంగా జరిగాయి. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శశి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సాంస్కృతిక కార్యదర్శిగా డాక్టర్ వంశీప్రియ వ్యవహరించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, ఆంధ్రప్రదేశ్ డీఎంఈ, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా రమణ పంచాంగ శ్రవణం నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడేలా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో డాక్టర్ నరసింహం మామిడి మొక్కలు నాటారు. వేడుకలకు గౌరవ అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజరయ్యారు. వివిధ విభాగాధిపతులు, పీజీ, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

రంగరాయ వైద్య కళాశాలలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, బోధకులు, ఉద్యోగులను ఆర్ఎంసీ ఉగాది పురస్కారాలు అందించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, హెచ్‌వోడీలు డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ సుజాత, డాక్టర్ ఉమామహేశ్వరరావు, సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శైలజ, కార్యాలయ ఉద్యోగి శివ పురస్కారాలు అందుకున్నారు.



శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శన

సర్పవరంలో..

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సాయంత్రం ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

శిల్పారామంలో సంబరాలు

కాకినాడ బీచ్ వద్ద ఉన్న శిల్పారామంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. శ్రీసీతారత్న లలిత కళా నికేతన్ ముళ్లపూడి విజయలక్ష్మి, జగ్గంపేట వారి బృందం సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించింది. కళాకారుల నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కాకినాడ నగర, గ్రామీణ ప్రజలు కుటుంబ సమేతంగా శిల్పారామం తరలివచ్చి, ఆనందోత్సాహాలతో పండగను జరుపుకొన్నారు. ఆదివారం కావటంతో వాటర్ పార్క్‌లో పిల్లలు సందడి చేశారు. శిల్పారామం ఇన్‌చార్జి పరిపాలనాధికారి సి.మోహన్ తేజ, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ విష్ణువర్ధన్



సర్పవరంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

పాదగయ క్షేత్రంలో ఎస్పీ బిందుమాధవ్ పూజలు

పిఠాపురం: కాకినాడ జిల్లా ఎస్పీ పి.బిందుమాధవ్ దంపతులు ఉగాదిని పురస్కరించుకుని కుక్కుటేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక హోమం నిర్వహించిన ఎస్పీ దంపతులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ వారికి శేష వస్త్రాలు, స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ తదితులున్నారు.

పాదగయ క్షేత్రంలో వేడుకలు

శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆదివారం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని వేద పండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యం శర్మ నిర్వహించారు. అనంతరం వేద పండితులకు, అర్చకులకు ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ గౌరవ సంభావన అందజేశారు.



హోమంలో పాల్గొన్న ఎస్పీ బిందుమాధవ్ దంపతులు